## 6వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

***పవిత్ర నామ జపము సర్వ తపో నిష్ఠల యొక్క ఫలములను ఇస్తుంది.***

ఎవరైనా పరమ లక్ష్యమును పొందుటకు తపస్సులను, నిష్ఠలను ఆచరించరించదలచిన, అతడు దేవాది దేవుని యొక్క ప్రీతిని పొందవలెను. భగవంతుని యొక్క ప్రీతిని పొందినవాడు అన్ని విధములైన నిష్ఠలను తపస్సులను ముగించి, వాటి ఆచరణలో సామర్థ్యమును పొందాడని అర్థం చేసుకోవాలి.

అలాకాక ఎవరైనా భక్తియుక్త సేవ యొక్క పరిపూర్ణ స్థితిని పొందకపోయినట్లయితే, సమస్త నిష్ఠలు మరియు తపస్సులకు నిజముగా ఎటువంటి అర్థం ఉండజాలదు. ఏలననిన పరమదేవుడు లేకుండా ఎవ్వరూ వాటి నుండి వెలువడే అత్యున్నత ఫలములను పొందజాలరు. భగవద్గీత 5:29 యందు చెప్పబడినట్లు సర్వ తపస్సులకు, యజ్ఞములకు శ్రీకృష్ణ భగవానుడే యజమాని, భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరం. ఆ విధంగా తపోనిష్ఠలను ఆచరించుట ద్వారా పొందగోరు ఫలితము శ్రీకృష్ణుని నుండి పొందవచ్చును.

మనిషి మావన సమాజములో పొందగలిగే హీన జన్మమైన చండాలుని కుటుంబున ఎవరైనా జన్మించినప్పటికీ అతడు భగవంతుని పవిత్ర నామములను జపించినట్లయితే అతడు మహిమాన్వితుడవుతాడు. ఏలననిన అటువంటి జపము వలన భక్తుడు తన పూర్వజన్మములో సర్వవిధములైన నిష్ఠలను ఆచరించి ఉన్నట్లు కచ్చితముగా ఋజువు చేస్తున్నాడని అర్థం చేసుకోవాలి.

పూర్వం మానవులు సముద్రమున ప్రవేశించి పది లక్షల సంవత్సరములు తపోనిష్ఠలు ఆచరించి పొందే అత్యున్నత సంపూర్ణ స్థితిని శ్రీచైతన్యుని కరుణ చేత మహామంత్రము (హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే) ను జపించిన వారు పొందగలరు. ఈ కలి కాలమున దిగజారిన మానవులకు గొప్పగా సమ్మతించి ఇవ్వబడిన హరే కృష్ణ మహామంత్ర జపము యొక్క లాభమును ఎవరైన స్వీకరించనట్లయితే అతడు భగవంతుని మాయా శక్తిచే అత్యధికముగా దిగ్భ్రాంతి చెంది ఉన్నాడని అర్థం చేసుకోవాలి.

***శ్రీమద్భాగవతము 4:24-14***

## చర్చ - విషయ విభాగము

## కృష్ణచైతన్య ఉద్యమము మరియు మరణానంతర జీవితము

చైతన్యమును పరిశుద్ధము గావించడమే కృష్ణ చైతన్యోద్యమము యొక్క లక్ష్యము. మరణ సమయమున మన చైతన్యము మనతో వస్తుంది కనుక ప్రస్తుతము మనము దివ్యచైతన్యమును అలవరుచుకుంటున్నాము. పువ్వు యొక్క సుగంధాన్ని గాలి తీసుకొని పోవునట్లు దేహము నుండి చైతన్యము తీసుకుపోబడుతుంది. మరణము తరువాత, భూమి, నీరు, నిప్పు, గాలి మరియు ఆకాశము మొదలైన పంచభూతములతో కూర్చబడిన ఈ దేహము తిరిగి మరల వాటియందు కలసిపోతాయి. లేదా బైబిల్ యందు చెప్పినట్లు "మట్టి నుండి ఈ రూపాన్ని పొందాము మరలా మట్టిలోనే ఈ రూపము కలసి పోతుంది". కొన్ని సంఘములలో శరీరమును కాలుస్తారు, ఇంకొన్ని వాటిలో పూడుస్తారు, మరికొన్ని వాటిలో దానిని జంతువులకు వేస్తారు. భారతదేశంలో హిందువులు శరీరమును కాలుస్తారు. ఆ విధంగా ఆ శరీరము బూడిదగా మారుతుంది. బూడిద కేవలం మట్టి యొక్కి మరో రూపము. క్రైస్తవులు శరీరాన్ని పూడుస్తారు. కొంత కాలం తరువాత స్మశానంలో ఆ శరీరం చివరికి ధూళిగా మారుతుంది. ఇది కూడా బూడిదలాగే మట్టి యొక్క మరొక రూపము. ఇంకా ఇతర సంఘములు ఉన్నాయి - భారతదేశంలో పార్శి సంఘము వంటివారు - వారు శరీరమును కాల్చరు, పూడ్డరు కాని దానిని రాబంధులకు వేస్తారు. రాబంధులు వెంటనే ఆ శరీరాన్ని తినడానికి వస్తాయి. ఆ తరువాత ఆ శరీరము చివరికి మలముగా మారుతుంది. అందుచేత ఏ విధంగానైనా మనము సబ్బులతో రుద్ది, ఎంతోచక్కగా శ్రద్ధ తీసుకుంటున్న ఈ అందలమైన శరీరము తుదకు మలముగానో, బూడిదగానో లేదా ధూళిగానో మారిపోతుంది.

మరణ సమయమున మనస్సు, బుద్ధి మరియు అహంకారము వంటి సూక్ష్మములతో ఏర్పడిన చైతన్యము, సూక్ష్మకణము వంటి ఆత్మను మరియొక దేహమునకు తీసుకొని పోవును. ఆత్మ ఈ దేహమున వాని కర్మల ప్రకారము ఆనందమును అనుభవించుట లేక బాధను ఎదుర్కొనుట గాని జరుగును. మన చైతన్యము మన కర్మచేత రూపొందించబడుతుంది. మనము మలముతో సాంగత్యము చేస్తే, గాలి మలము యొక్క దుర్గంధమును కొనిపోవునట్లు మన చైతన్యము మరణ సమయమున మనల్ని మనము ఇష్టపడని మరొక శరీరమునకు తీసుకుపోతుంది. లేదా గులాబీలతో సాంగత్యము చేస్తే, గాలి ఆ గులాబీల సుగంధాన్ని కొనిపోవునట్లు మనము పుణ్య ఫలితాలను అనుభవించే ఆనందదాయకమైన శరీరాన్ని పొందుతాము. మనము కృష్ణ చైతన్యమునందు పనిచేసే విధంగా తర్ఫీదు ఇచ్చుకుంటే మన చైతన్యము మనల్ని కృష్ణుని దగ్గరకు చేర్చుతుంది. చైతన్యమును అనుసరించి వివిధ రకములైన దేహములు ఏర్పడతాయి.

అందుచేత యోగనియమముల ప్రకారము మన చైతన్యమునకు శిక్షణను ఇస్తే, మనము యోగమును అభ్యాసము చేయగలిగే ఒక దేహమును పొందుతాము. మనకు మంచి తల్లిదండ్రులు లభిస్తారు. యోగ విధానమును అభ్యాసము చేయగలిగే అవకాశం ఉంటుంది. ఆ విధంగా మనము పూర్వ జన్మలో అభ్యసించిన కృష్ణ చైతన్యమును పునరిద్ధించుకొనగలుగుతాము. అందుచేత ఈ

చివరి శ్లోకములో ఇలా చెప్పబడినది - "పూర్వ జన్మమున సాధనపొందిన దివ్యచైతన్యము యొక్క ప్రభావముచే ప్రయత్నింపకుండానే అతడు స్వయముగ యోగ సిద్ధాంతములచే ఆకర్షింపబడును". కాబట్టి దివ్యచైతన్యమును వృద్ధి చేసుకోవడమే మన ప్రస్తుత కర్తవ్యము. పూర్ణ జ్ఞానముతో కూడిన, ఆనందదాయకమైన, శాశ్వతమైనటువంటి ఆధ్యాత్మికతతో కూడిన దివ్య జీవితమును పొందాలనుకున్న, అనగా తిరిగి భగవద్ధామమునకు చేరుకోవలెననుకున్న దివ్యచైతన్యమును అనగా కృష్ణచైతన్యమున శిక్షణ పొందవలెను.

దీనిని సాంగత్యము ద్వారా సులభముగా పొందవచ్చును. (సంగాత్ సంజాయతే కామః) దివ్య సాంగత్యము ద్వారా మన చైతన్యము దివ్యమగును. అసుర సంగత్యము ద్వారా మన చైతన్యము అసురమగును. కాబట్టి మన చైతన్యమును కృష్ణ భక్తుల సాంగత్యముతో దివ్యముగా ఉండేటట్లు శిక్షణనివ్వాలి. మరుజన్మును దివ్యము చేసేటటువంటి అవకాశము ఈ మానవ జన్మకే ఉన్నది. అందువలన మానవ జన్మ పొందిన వారి కర్తవ్యము ఇదే. ఈ లక్ష్యసాధనకు మనము ఈ దివ్యచైతన్యమును పెంపొందించుకొనుచున్న వారి సాంగత్యమును పొందుటకు ప్రయత్నించాలి. కృష్ణచైతన్యము స్వయంగా భగవంతునితో సంబంధమేర్పరచే ప్రక్రియ. ఇది శ్రీచైతన్య మహాప్రభువు యొక్క ప్రత్యేక బహుమతి. ఈ పద్ధతి సుగమమైనదే గాక, త్వరితమైనది మరియు అనుసరణీయమైనది. ఎటువంటి అర్హతలు లేకపోయినప్పటికీ ఈ సంఘమునందు ప్రవేశించువారు కేవలం ఈ ఉద్యమ సాంగత్యము ద్వారా కృష్ణచైన్యములో అత్యంత ప్రగతిని సాధించారు.

*యోగసిద్ధి పథం*

**కనుగొనుట :**

1. కృష్ణచైతన్యోద్యమము యొక్క ఉద్దేశ్యము ఏమిటి?
2. మృత్యు సమయమున మన దేహములకు ఏమి జరుగును ?
3. మృత్యు సమయమున మన ఆత్మలకు ఏమి జరుగును ?

**అవగాహన :**

1. మన చైతన్యమును పరిశుద్ధి కావించుకొనుడము ఎందుకు ముఖ్యము? పైన చెప్పబడిన ఉదాహరణలతో వివరించండి ?
2. కృష్ణుని యొక్క ఆధ్యాత్మిక ప్రపంచమునకు తిరిగి వెళ్ళుట వలన కలుగు ప్రయోజనములు ఏమిటి ?
3. కృష్ణచైతన్యమునందు ఉన్న భక్తులతో సాంగత్యమును పొందుట ఎందుకు అత్యంత ముఖ్యము?
4. ఏ విధమైన పూర్వపు అర్హతలు లేనప్పటికీ ఏ విధముగా ప్రతీ ఒక్కరిని కృష్ణచైతన్యోద్యమము సులభముగా ఉన్నతులను కావిస్తున్నది?

**అనువర్తనము :**

1. ఈ కార్యక్రమము క్రమం తప్పకుండా విచ్చేయడం మీకు ఆనందదాయకరముగా ఉన్నదా? ఈ సత్సంగమును క్రమం తప్పకుండా హాజరు కావడానికి మీకు ఏవిధమైన అడ్డంకులు ఉన్న వాటిని పంచుకోండి.

# ప్రచారమే సర్వసారము

***కృష్ణచైతన్యము ఎటువంటి భేదము లేకుండా ప్రతి ఒక్కరికీ పంచి ఇవ్వాలి.***

శ్రీచైతన్య మహాప్రభువు గొప్ప గౌరవ భావముతో అద్వైతాచార్యునిని "హీనాతి హీనమయిన మానవులకు (చండాలుడు) సహితము కృష్ణచైతన్యమును, కృష్ణుని యందు బక్తిని ఇవ్వమ"ని ప్రార్థించాడు.

ఇది శ్రీచైతన్య మహాప్రభువు తన భక్తులందరికి ఇచ్చిన ఆదేశము. కృష్ణ భక్తి చండాలురు వంటి హీన తరగతి మానవులకు సహితము తెరచి ఉన్నది. శ్రీ అద్వైత నిత్యానంద ప్రభువుల నుండి విస్తరించిన గురు శిష్య పరంపర యందున్న వారు ఈ ఆదేశమును అనుసరించి ఎటువంటి తారతమ్యము లేకుండా ప్రపంచమంతటా కృష్ణచైతన్యమును వ్యాప్తి చేయాలి.

బ్రాహ్మణుల నుండి మొదలుకుని హీన స్థితిగా పరిగణించబడి చండాలుని వరకు క్రిందకు పోయినట్లయితే విభిన్నమైన మానవులు ఉన్నారు. ఎవరి స్థితి ఏదైనను, ఈ కలికాలమున ప్రతి ఒక్కరు కృష్ణచైతన్యముచే జ్ఞానోదయము పొందుట అవసరము. ఇదే రోజులోని అతి గొప్ప అవసరము. ప్రతి ఒక్కరు భౌతిక జీవనపు అత్యంత తీక్షణమైన బాధలను అనుభవిస్తున్నారు. మానవ సమాజము వ్యభిచారము, మాంసభక్షణము, జూదము మరియు మత్తు పదార్థముల సేవనములో యథేచ్ఛగా నిమగ్నమగుట వలన సంభవించు కలియుగపు సూదులు గ్రుచ్చే యాతనలు ప్రతి ఒక్కరు అనుభవిస్తున్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘము యొక్క సభ్యులు కృష్ణ భక్తిని ప్రపంచమంతట వ్యాపింపచేయడానికి ఇదే సరియైన సమయము.

ఆ విధంగా శ్రీచైతన్య మహాప్రభువు యొక్క ఆదేశములను అనుసరించాలి. భగవంతుడు ప్రతి ఒక్కరిని గురువుగా అవ్వమని అదేశించాడు (చై.చ.మధ్య 7-128)... ప్రతి ఒక్క పట్టణము, పల్లెలో ఉపదేశము చేత జ్ఞానోదయము కావాలి. వ్యత్యాసములు లేకుండా ప్రతి ఒక్కరికి కృష్ణచైతన్యమును పంచాలి. ఈ విధముగా శ్రీచైతన్య మహాప్రభువు ఆశించినట్లు ప్రపంచమంతా, శాంతియుతముగా, సంతోషముగా ఆయనను అందరూ స్తుతిస్తారు.

చండాల అను పదము మానవులలో అత్యంత హీనముగా పరిగణించబడే శునక మాంసము భుజించే వానిని సూచిస్తుంది. శ్రీచైతన్య మహాప్రభువు యొక్క దీవెన చేత చండాలురు సహితము కృష్ణ చైతన్యమున జ్ఞాన వికాసమును పొందగలరు. కృష్ణచైతన్యము ఏదో ఒక వర్గమునకు సంబంధించినది కాదు. శ్రీచైతన్య మహాప్రభువుచే ఇవ్వబడిన ఈ గొప్ప వరమును పొందుటకు ప్రతి ఒక్కరు అర్హతగలవారే. ప్రతి ఒక్కరు ఇది పొంది ఆనందమును పొందుటకు ఒక అవకాశమును ఇవ్వాలి.

***చై.చ.మధ్య. 15:41***